కథ

# ముత్తైదువ

విప్పగుంట జ్ఞానప్రసూనాంబ

**"అమ్మాయ్ విజయా! రేపు శుక్రవారం కదూ! ముత్తైదువ వస్తుంది. తాంబూలం ఇచ్చుకో తల్లీ! పుని స్త్రీలకు మంచిది" అంది ఇంటిగలావిడ చొరవగా లోపలికి వచ్చి సోఫాలో కూర్చుని.**

అర్థం కానట్టు చూశాను ఆవిడ వైపు.

"ప్రతి శుక్రవారం ఇక్కడకు ఓ పేద ముత్తైదువ వస్తుందమ్మాయ్. ఆమెకు బొట్టు పెట్టి, ఐదు రూపాయల దక్షిణ పెట్టి పండూ, తాంబూలం ఇస్తాం మేమందరం. పుని స్త్రీలు అలా చేస్తే మంచిదంటారు. నీకు కూడా ఈ విషయం చెబుదామని వచ్చాను" అంది వివరంగా.

"ఓహో! అలాగా!" అన్నాను తేలిగ్గా.

'శ్రీవారి ఉద్యోగ రీత్యా కొత్తగా వచ్చాం ఈ వూరికి. ఈ లోగిలిలో చేరి ఐదు రోజులైంది. ఇక్కడి పద్ధతులు, అలవాట్లు, ఆచార వ్యవహారాలు పూర్తిగా తెలియవింకా. అయినా పండ్లు, తాంబూలం, ఐదు రూపాయిలే గదా! అదేం భాగ్యం? పోయిందేముందిలే' అనుకున్నాను.

"అలాగే పిన్నిగారూ!" అన్నాను. సంబరంగా వెళ్ళిందామె.

ఆరోజు రాత్రి శ్రీవారితో చెప్పాను ముత్తైదువ విషయం.

"ఇలా వారానికోరోజు ఆవిడకు తాంబూలాలిచ్చే బదులు ఆమెకేదో జీవనాధారం చూపించవచ్చు గదా?" అన్నారాయన సాలోచనగా.

ఆయన చెప్పింది సబబే అనిపించింది నాకు. కాని..ఆమె విద్యార్హత లేమిటో? పరిస్థితులేమిటో తెలియకుండానే, తెలుసుకోకుండానే ఏం చెప్పగలం? ఆమెను గురించి ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకున్నాను.

*** *** ***

ఉదయం పది గంటలు దాటింది. శ్రీవారు ఆఫీసుకు, పిల్లలు స్కూలుకూ వెళ్ళారు. ఆరోజు ఉదయాన్నే తెచ్చిన వీక్లీ చేత పట్టుకుని నా అభిమాన రచయిత సీరియల్ చదువుతున్నాను.

కాలింగ్ బెల్ మోత విని విసుగ్గా లేచి తలుపు తీశాను. ఇంటిగలావిడ. పక్కనే మరో కొత్తావిడ. తలంటుకున్న కురులు రాగి వర్ణం దాల్చి ఆమె నొసట మీద నాట్యం చేస్తున్నట్టున్నాయి. పావలా కాసంత కుంకుమ బొట్టు, వెలిసి పోయిన చీరా-జాకెట్టూ, మెడలో పసువు తాడు, నల్లపూసలు, చెవులకు గిల్టు కమ్మలు తప్ప చిన్నమెత్తు బంగారమైనా లేదు ఆవిడ ఒంటిమీద. పేదరికమంతా ఆమె రూపంలోనే వున్నట్టనిపించింది నాకు. బహుశా 'ఆవిడే 'శుక్రవారం ముత్తైదువ' అయివుండవచ్చు ననుకున్నాను.

"రండి" అని సాదరంగా లోనికి ఆహ్వానించాను.

"నేను చెప్పింది ఈవిడేనమ్మాయ్! పేరు శారదమ్మ. చాలా మంచిది. మొదట మీ ఇంటికే పిలుచుకొచ్చాను. పదిన్నర నుంచి రాహుకాలం కదా! మొదటి సారిగా ఆ టైములో రావడమెందుకని ఇప్పుడు తీసుకొచ్చాను. మీరు మాట్లాడుతుండండి. వస్తాను" అని పరిచయం చేసి వెళ్ళిందామె.

శారదమ్మ పదో తరగతి ప్యాసైంది. తల్లిదండ్రులు చదివిస్తామన్నా వినక, మేనమామ కొడుకైన 'శివయ్య'ను వివాహమాడింది. చదువు-ఉద్యోగం లేని అతడు వేదం కూడా నేర్చుకోలేక పోయాడు. 'భోక్త'గా మాత్రం మిగిలాడు. తల్లిదండ్రుల నిరాదరణకు గురైన అతను భార్యను 'ముత్తైదువ'గా మార్చి జీవన యాత్ర సాగిస్తున్నాడు. కష్టపడి పని చేసేకంటే ఈ వృత్తే బాగుంటుందని తృప్తిపడ్డారు ఆ దంపతులు.

ఇలాంటి వారిని మార్చడం చాలా కష్టమని నాకు తెలుసు. అసలు ఈ వ్యవస్థ ఎలా ఏర్పడిందోనన్న ఆలోచన నా మదిలో చోటుచేసుకుంది. ఏనాడో చరిత్రలో చదివిన 'కుల వ్యవస్థ' గుర్తుకు వచ్చింది. సోమరితనానికి అలవాటు పడ్డవారిని పనిలోకి దింపడం అంత తేలిక కాదనుకున్నాను.

తాంబూలం, దక్షిణలతో పాటు జాకెట్ బిట్ కూడా పెట్టి ఇచ్చాను. సంతోషంగా తీసుకుని, నన్ను ఆశీర్వదించి వెళ్ళింది శారదమ్మ. ఆ తర్వాత ఇంటిగలావిడ శారదమ్మ చేత బట్టలు ఆరవేయించుకోవడం, పక్క పోర్షనులో వున్నావిడ పని మనిషి రాలేదని గిన్నెలు కడిగించుకోవడం చూసి నా మనసు విల విల్లాడింది. 'ముత్తైదువ' అంటూనే, ఆమె పేదరికాన్ని ఆసరాగా తీసుకుని, ఆమె చేత పని చేయించుకుంటున్న ఆ ఇద్దరి పట్ల ఏహ్యాభావం కలిగింది. కష్టపడి పని చేసుకుని గౌరవంగా బ్రతకడం ఇష్టపడని శారదమ్మ ఇలా వీళ్ళకు పని చేయడం చూస్తుంటే, ఆమె పట్ల, ఆమె సోమరితనం పట్లా ఆగ్రహం చోటుచేసుకుంది నాలో.

ఆరోజంతా నా మనసు వ్యాకులపడి భారంగా వుంది.

"ప్రతి చిన్న విషయాన్నీ ఎందుకంత సీరియస్‌గా తీసుకుంటావ్?" అన్న శ్రీవారి హితవుతో 'టేకిట్ ఈజీ' అని మనసును సమాధాన పర్చుకుని ఇక ఆ విషయాన్ని ఆలోచించడం మానేశాను.

*** *** ***

ఆ తర్వాత శుక్రవారం మిట్ట మధ్యాహ్నం వూట ఇంటికొచ్చిన శారదమ్మను అలానే చూస్తూ నిలబడ్డాను. కొత్త చీర-జాకెట్టు ధరించింది. మెడలో వూల మాల, తల నిండా వూలు, చేతుల నిండుగా గాజులు..ఆమె వైపు ఒక్క క్షణం చూసి కళ్ళు తిప్పకున్నాను. ఆ అలంకరణలో ఆమె రూపం మెరుగ్గా వున్నా, ఆమె కనుల నుంచి జాలువారుతున్న కన్నీళ్ళు నా దృష్టి పథం నుంచి తప్పించుకోలేకపోయాయి.

"శారదమ్మా! ఏమైంది? ఎందుకా కన్నీళ్ళు?" లాలనగా అడిగాను ఆమె చెంతకు వెళ్ళి.


"నన్ను ఏడవనీ విజయా! తృప్తిగా, కరవుదీరా ఏడవనీ తల్లీ" అంది రెండు చేతులతో మొహం కప్పకుని.

మెల్లగా పట్టుకుని, ఆమెను సోఫాలో కూర్చోబెట్టాను.

"పెద్దల మాట పెడ చెవిన పెట్టిన ఫలితం అనుభవిస్తున్నాను. నేను ఏం పోగొట్టుకున్నానో, ఎలా బ్రతుకుతున్నానో ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాను" వెక్కిళ్ళ మధ్య తన బాధను చెప్పకుపోతోంది.

"ఊరుకో శారదా!" అన్నాను వూరడింపుగా.

ఆమె అలంకరణ చిత్రంగా వుంది నాకు. ఆమె



వైపు అలానే చూస్తున్నాను.

'ఏమిటలా చూస్తున్నారు? నా వేషమా! నాకిది మామూలే. ముత్తైదువగా చనిపోయిన స్త్రీ వేషమిది. పుని స్త్రీ చనిపోయిన పదో రోజున కొత్త చీర, రవిక, పూలు, పసుపు-కుంకుమలు పెట్టి ఆవిడ పేరుతో నన్ను కొలిచి సాగనంపుతారు. ఇప్పటికి ఎన్ని వందలో..కాదు..కాదు ఎన్ని వేలసార్లో పుట్టాను. గిట్టాను" అంది కన్నీళ్ళు పైట చెంగుతో తుడుచుకుంటూ.

"కనీసం ఈ మాట..ఇలా చెప్పుకునేందుకైనా నాకు ఇంత వరకూ మనసున్న మనిషి తటస్థపడలేదు. మీతోటి పరిచయం ఒక వారం రోజుల పాటిదే అయినా, జన్మ జన్మల బంధంలా, పరిచయంలా అనిపించింది. నా మాటలతో మిమ్మల్ని విసిగించి వుంటే మన్నించండి. మా అత్త గారు, ఆడపడుచు నా రాక కోసం, నేను తీసుకువచ్చే పైకం కోసం ఎదురు చూస్తూ వుంటారు. వస్తానమ్మా" అంది బేలగా. గదిలోకి వెళ్ళి పది రూపాయిల కాగితం తెచ్చాను. శారదమ్మ లేదు అక్కడ.

ఆమె ఆవేదనను అర్థం చేసుకోగలిగాను. అభిమానం, అభీష్టం చంపుకుని కేవలం తన వారికోసం బ్రతుకుతోంది ఆమె. జీవనాధారానికి 'ముత్తైదువ' గా మారింది.

మన ఆచార వ్యవహారాల పట్ల తొలిసారి ఈమెను చూశాక నిరసన ఏర్పడి ప్రజ్వరిల్లసాగింది నాలో. అసలు ఈ దేశంలో 'స్త్రీ'గా పుట్టడమే నేరమా?

వైవాహిక బంధంతో చేరువైన భర్త మరణించిన 'పదవ రోజు' ఆ స్త్రీ జీవితంలో పసుపు-కుంకుమలు పరిసమాప్తి చెందే రోజు. గుండెలు పిండే ఆవేదనతో అలమటించే రోజు. ఆప్తులందరూ గుండెలవిసేలా కుమిలిపోయే రోజు. ఆమె చనిపోయినా, పునిస్త్రీ మరణమని మరో 'స్త్రీ'ని వేధించే ఘడియ.

ఈ దురాచారాలకు అంతం ఎప్పుడు? మరో వీరేశలింగం జన్మించాల్సిందేనా? కాదు...కాదు...ప్రతి ఒక్కరూ వీరేశలింగంలా మారినప్పుడే.....